

ఆదివాసీల జెండాను ఎగురవేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయాలనే ప్రభుత్వ నిర్ణయంపై స్థానిక ప్రజలు భగ్గుమంటున్నారు. తమ గ్రామాలను మున్సిపాలిటీలో చేర్చవద్దని.. పంచాయతీలుగా ఉండడమే లాభమని చెబుతున్నారు. కనీస వసతులు కూడా లేని గ్రామాలను మున్సిపాలిటీల్లో చేర్చడం వల్ల తమకు లాభం లేకపోగా ఇంటి, నీటి పన్నులు పెరిగి తమపై ఆర్థిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిని వ్యతిరేకిస్తూ ఇప్పటికే ఆ గ్రామాల ప్రజలు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఇక, దీనికి వ్యతిరేకంగా కార్యాచరణ చేపట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ స్థానికుల అభిప్రాయాలు సేకరిస్తోంది.

45 గ్రామాల విలీనంపై ప్రజల్లో వ్యతిరేకత

- పన్నులు పెరుగుతాయని ఆందోళన
- అధికారులకు గ్రామస్తుల వినతిపత్రాలు
- మున్సిపాలిటీల విలీనంపై కూడా అభ్యంతరాలు



విలీన ప్రతిపాదిత గ్రామాలు (ఎరుపు రంగులో..)

పంచాయతీనే ముద్దు

జీహెచ్ఎంసీ వద్దు!

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

హైదరాబాద్ నగర శివార్లలోని కొన్ని గ్రామాలతో పాటు మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని తీసుకున్న నిర్ణయం పట్ల కొన్ని ప్రాంతాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. హైదరాబాద్ మహానగరాన్ని మరింత విస్తరించేందుకు ఔటర్ రింగు రోడ్డుకు ఆనుకొని ఉన్న 45 గ్రామాలను ముందుగా సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసి ఆ తరువాత గ్రేటర్‌లో కలిపేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై ఇప్పటికే రూట్‌మ్యాప్ కూడా సిద్ధం చేశారు. ఈ గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు కూడా నిర్వహించరాదని సర్కార్ నిర్ణయించి ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉంటే సర్కార్ నిర్ణయంపై స్థానికంగా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిర్ణయంపై పోరాడేందుకు కొందరు సిద్ధమవుతున్నారు. శివారు ప్రాంతాల్లోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలను విలీనం చేయడంతో లక్షలాది మందిపై పన్నుల భారం పెరగనుంది. ఇంటిపన్నుతో పాటు వాటర్ బిల్లులు పెరుగుతాయి. ఇప్పటికీ అనేక గ్రామాల్లో సరైన మౌలిక సదుపాయలు లేవు. ఇటీవల కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో కూడా ఇప్పటి వరకు మౌలిక సదుపాయాలు లేవు. అలాంటిది పంచాయతీలను విలీనం చేస్తే తమకు కొత్తగా ఒనగూరిదేమీ ఉండదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి జీహెచ్ఎంసీలో విలీనం వల్ల ఇంటిపన్ను అమాంతంగా అనేక రెట్లు పెరుగుతుంది. దీంతో అనేక గ్రామాల ప్రజలు ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల ప్రజలు అధికారులను కలిసి తమ గ్రామాన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేయవద్దని, యథావిధిగా కొనసాగించాలని వినతి పత్రాలు అందజేస్తున్నారు. గ్రామాల్లో రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని.. ఇపుడు గ్రామాలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తే పన్నుల భారం భరించడం కష్టమని వారు ఆందోళన చెందుతున్నారు. అలాగే గ్రామకంఠంపై కట్టే ఇళ్లకు పంచాయతీల్లో ఇంటి నంబర్లు ఇవ్వడం లేదు. జీహెచ్ఎంసీలో విలీనం తరువాత ఇలాంటి వాటి విషయంలో ఏం చేస్తారో తెలియడం లేదు. తొలుత ఈ గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసే తరువాత వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి ఈ ప్రాంతాలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తామని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. అయితే గతంలో ఎన్నడూ ఇలా జరగలేదు. తొలుత శివారు పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసి ఆ ప్రాంతాలు కొంతమేర అభివృద్ధి చేసిన తరువాత కొన్ని సంవత్సరాలకు జీహెచ్ఎంసీలో విలీనం చేశారు. అయితే ఇపుడు ప్రభుత్వం పల్లెల్లో ఎలాంటి మౌలిక సదుపాయాలూ కల్పించకుండానే ఏడాది కాలంలోనే జీహెచ్ఎంసీలో 45 గ్రామాలను విలీనం చేయాలని నిర్ణయించడంపై విమర్శలు వస్తున్నాయి. అలాగే శివారు ప్రాంతాల్లోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేయడంపై కూడా కొన్ని ప్రాంతాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కొందరు గట్టిగా పోరాడేందుకు సిద్ధమవుతున్నారు. న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించాలని భావిస్తున్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా దీనిపై స్థానిక నేతల నుంచి అభిప్రాయాలు సేకరిస్తోంది. మాజీ మంత్రి సబితారెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డి శివార్లలోని గ్రామస్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. దీనిపై త్వరలోనే కార్యాచరణ మొదలు పెట్టేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. ఇదిలా ఉంటే అధికార పార్టీకి చెందిన స్థానిక నేతలు కూడా సర్కార్ నిర్ణయంపై బహిరంగంగా మాట్లాడకపోయినప్పటికీ దీన్ని వ్యతిరేకిస్తున్నారు.



విలీన గ్రామాల వివరాలు

మున్సిపాలిటీ	విలీన గ్రామాలు
మేడ్చల్ జిల్లా పరిధిలో 23 గ్రామాలు	
ఘట్‌కేసర్	మర్రిపల్లిగూడ, ఏదులాబాద్, ఘనాపూర్,
నాగారం	కీసర, రాంపల్లి దాయర, యాద్గార్‌పల్లి, చీర్యాల
తూంకుంట	బాబాగూడ, బొమ్మరాశిపేట, శామీర్‌పేట
మేడ్చల్	రాయిలాపూర్, పూడూరు
గుండ్లపోచంపల్లి	గౌడవెల్లి, మునీరాబాద్
దమ్మాయిగూడ	తిమ్మాయిపల్లి, నర్సంపల్లి, కరీంగూడ, గోధుమకుంట
పోచారం	చౌదరిగూడ, వెంకటాపూర్, కాచవాని సింగారం, కొర్రెముల, ప్రతాప్‌సింగారం
రంగారెడ్డి జిల్లా పరిధిలో 11 గ్రామాలు	
మున్సిపాలిటీ	విలీన గ్రామాలు
పెద్ద అంబర్‌పేట	కుత్బుల్లాపూర్, తారామతి పేట, గౌరెల్లి, బాచారం
శంషాబాద్	రషీద్‌గూడ, బహదూర్‌గూడ, హమీదుల్లానగర్, చిన్న గోల్కొండ, పెద్ద గోల్కొండ
శంకర్‌పల్లి	మీర్జాగూడ
తుక్కుగూడ	హర్షగూడ
సంగారెడ్డి జిల్లా పరిధిలో 11 గ్రామాలు	
మున్సిపాలిటీ	విలీన గ్రామాలు
అమీన్‌పూర్	ఐలాపూర్, ఐలాపూర్ తండా, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, దాయర, సుల్తాపూర్
పటాన్‌చెరు	పోచారం, ముత్తంగి, కార్ధనూర్, పాటి, ఘనాపూర్

మున్సిపాలిటీల్లో విలీన ప్రక్రియ దాదాపు పూర్తి

ఔటర్‌కు ఆనుకుని ఉన్న 45 గ్రామపంచాయతీల్లో ఎన్నికల పక్రియ నిలిపివేసి వీటిని పురపాలక సంఘాల్లో విలీనం చేసే ప్రక్రియను ప్రభుత్వం దాదాపు పూర్తి చేసింది. పురపాలికల్లో విలీనమయ్యే గ్రామాలు మేడ్చల్ జిల్లా పరిధిలో అధికంగా ఉన్నాయి. మేడ్చల్ జిల్లాలో 23 గ్రామాలు ఏడు పురపాలికల్లో విలీనం చేస్తున్నారు. అలాగే రంగారెడ్డి జిల్లాలోని నాలుగు పురపాలికల్లో 11 గ్రామాలను విలీనం చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో రెండు పురపాలికల్లో 11 గ్రామాలు విలీనం కానున్నాయి.

ఉన్నతంగా ఎదిగేందుకు చదువే ప్రధానం

- బడీడు పిల్లలను తల్లిదండ్రులు స్కూళ్లకు పంపించాలి
- ఆదివాసీ దినోత్సవంలో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

పెద్దేముల్, ఆగస్టు 9: సమాజంలో మనిషి ఉన్నత స్థితికి ఎదగాలంటే చదువే ప్రధానమని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పెద్దేముల్ మండలం చైతన్య నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి, కొమురంభీం, చెంచులక్ష్మి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆదివాసీల ఆకుపచ్చ జెండాను ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువుతో ఎంతటి స్థాయినైనా అధిరోహించవచ్చని నిరూపించిన అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని విద్యను అభ్యసించాలని కోరారు. బడీడు పిల్లలందరూ పాఠశాలకు వెళ్లే విధంగా తలిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.

ఇంటింటి సర్వే నిర్వహించాలి

సమాజంలో సంస్కృతి, సాంప్రదాయలు, స్వాభిమానంతో బతకాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అందరూ ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని కలెక్టర్ కోరారు. ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం అధికప్రాధాన్యతనిస్తూ ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. జన్మాన్ పథకం ద్వారా గ్రామంలో కావాల్సిన సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇంటింటి సర్వే నిర్వహించి వారికి కావాల్సిన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి కమలాకర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో పాల్వన్ కుమార్, తహసీల్దారు కిషన్‌నాయక్, మైన్స్ ఏడీ సత్యనారాయణ, డీఎల్‌పీవో శంకర్‌నాయక్, ఎంపీడీవో జర్నప్ప, ఎంపీవో రతన్‌సింగ్, ఆదివాసీ సంఘం రాష్ట్ర నాయకులు అంజయ్య, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ప్రభుత్వ భూముల రక్షణకు పటిష్ట చర్యలు

- సర్వే వివరాలను కేఎంఎల్ మ్యాప్‌లో పొందుపర్చాలి
- రెవెన్యూ అధికారులకు మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ ఆదేశాలు

మేడ్చల్ ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో జిల్లాలోని భూముల సర్వేపై అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను సర్వే చేసి అవి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకునేలా పైలెట్ ప్రాజెక్టు కింద భూసర్వేను నిర్వహించి కేఎంఎల్ మ్యాప్(గూగుల్)లో పొందుపర్చాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కచ్చితమైన ప్రమాణాలతో జిల్లాలోని నిషేధిత భూములు, రక్షణ శాఖ, అటవీశాఖ, సీలింగ్ భూములు, అసైన్డ్ భూములు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన భూముల వివరాలను సాంకేతికంగా కీహోల్ మార్కప్ లాంగ్వేజ్(కేఎంఎల్) మ్యాప్(గూగుల్)లో పొందుపర్చాలని సూచించారు. దీని ద్వారా ఎల్ఆర్ఎస్‌లో భాగంగా లేఅవుట్ల రెగ్యులరైజేషన్ బిల్డింగ్ అనుమతులు, టీజీ ఐపాస్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారికి కేఎంఎల్ మ్యాప్ ప్రకారం భూములను కేటాయిస్తూ అనుమతులు ఇచ్చేందుకు సులభతరం అవుతుందన్నారు. అలాగే రక్షణశాఖ, అటవీశాఖ భూములకు సంబంధించి సరిహద్దులను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లపై అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, గ్రౌండ్‌లో మెడికల్ టీమ్‌తో ఎమర్జెన్సీ సేవలు, నిరంతర విద్యుత్ సరఫరా, ఉత్తమ సేవలందించే ఉద్యోగులను గుర్తించి సేవా ప్రశంసా పత్రాల కోసం ప్రతిపాదనలు పంపాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టరేట్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు.



మేడ్చల్ పెద్దచెరువు కట్ట వద్ద పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

శ్రావణ మాస ప్రారంభంలో వచ్చే నాగుల పంచమి వేడుకలను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో పుట్టల వద్దకు వెళ్లి నాగదేవతకు పాలుపోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబాలను చల్లంగా చూడాలని నాగదేవతలను వేడుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్

మొక్కలు నాటి ప్రకృతిని కాపాడాలి

- జిల్లా ప్రత్యేకాధికారి ఈ.శ్రీధర్

వికారాబాద్ ఆగస్టు 9: చెట్లను నాటినట్లయితే ప్రకృతిని కాపాడిన వారమవుతామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్, వనమహోత్సవం జిల్లా ప్రత్యేక అధికారి ఈ. శ్రీధర్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వికారాబాద్ మండలం ఘట్ కొండాపూర్, అనంతగిరి అటవీ పరిసరాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఆయన కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జైదుపల్లి పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. వన మహోత్సవ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డీవైఎస్ఓ హనుమంతరావు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న కమిషనర్ శ్రీధర్ పక్కన కలెక్టర్ ప్రతీక్‌జైన్

సారా తయారీపై ఉక్కుపాదం మోపాలి

జిల్లాలో సారా తయారీపై ఉక్కుపాదం మోపి, నెలాఖరులోగా పూర్తిగా నిషేధం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఈ.శ్రీధర్ ఆదేశించారు. శుక్రవారం పూడూరు మండలంలోని బృందావన్ డిస్టిలరీని ఆయన సందర్శించారు. అనంతరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు.

హాస్టళ్లలో అన్ని సదుపాయాలు కల్పించాలి

- విద్యార్థుల చదువు, ఆరోగ్యంపై అధికారులు దృష్టి సారించాలి
- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, ఆగస్టు 9: హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పన సక్రమంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ వసతి గృహ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల హాస్టళ్లలో నూతన విద్యార్థుల ప్రవేశాలపై చర్చించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు హాస్టళ్లను నిత్యం పర్యవేక్షించాలన్నారు. విద్యార్థుల చదువు విషయంలోనూ అధికారులు వ్యక్తిగత శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, మానసిక వికాసం అభివృద్ధిపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి జిల్లా అధికారి మల్లేశం, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఉపేందర్, షెడ్యూల్ తెగల అభివృద్ధి అధికారి కమలాకర్ రెడ్డి, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంఈవోలు వసతి గృహ సంక్షేమ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

యాలాల, ఆగస్టు 9: ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా నాయకులు ఉప్పలి మల్కయ్య అన్నారు. యాలాల మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తంచేసి తహసీల్దార్ అంజయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సిములు, కృష్ణ, డి.నర్సింహులు, కమలాపురం నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ డీఎంఈ రాజీనామా!

- ఆ పోస్టు తనకొద్దంటూ సర్కారుకు శివరాంప్రసాద్ లేఖ
- కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు తేవాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి!
- అది భరించలేకనే తప్పుకొన్న శివరాం?

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్ తన పదవికి రాజీనామా చేశారు. తనను ఆ పోస్టు నుంచి తప్పించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాను అకడమిక్ డీఎంఈగా విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నానని లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య సంచాలకుల పరిధిలో జరిగిన సాధారణ బదిలీల కంటే ముందే ఆయన సర్కారుకు రాజీనామా లేఖను పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఆయన డీఎంఈ కార్యాలయానికి కూడా రావడం లేదు. వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడిగా తీవ్ర మైన పనిభారం, ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేకనే ఆ పోస్టు నుంచి తప్పుకొన్నారని శివరాంప్రసాద్ సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తగా 8 వైద్య కళాశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, అధ్యాపకులు, సౌకర్యాల లేమి కారణంగా 8 కాలేజీలకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇవ్వలేదు. దీనిపై డీఎంఈ కార్యాలయం అప్పీలుకు వెళ్లగా.. నాలుగింటికి అనుమతులు వచ్చాయి. మరో నాలుగు పెండింగ్‌లో ఉన్నాయి. ఎలాగైనా సరే వాటికి అనుమతులు తీసుకురావాల్సిందేనని ఉన్నతాధికారులు డీఎంఈ కార్యాలయంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అది భరించలేకనే ఆయన అకడమిక్ డీఎంఈ పదవి నుంచి వైదొలగినట్లు తెలుస్తోంది.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

- అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత
- తెల్లవారుజామున ఆస్పత్రికి తరలింపు
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- టీచర్ల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 9: అర్ధరాత్రి అస్వస్థతకు గురైన ఇద్దరు గురుకుల విద్యార్థులను తెల్లవారు జామున ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందగా.. మరొకరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎలమాడల అనిరుధ్ (11), జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మొండి మోక్షిత్ గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో పీఈటీ వెళ్లగా.. కడుపు నొప్పిగా ఉందని అనిరుధ్, మోక్షిత్‌లు తెలిపారు. దీంతో వెంటనే కేర్‌టేకర్‌లు, అనిరుధ్ తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి వారిని కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం విషమంగా ఉందని తెలపడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పతికి తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలిసి వైద్యుడు కూడా అయిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్.. విద్యార్థులు పాము కాటుకు గురై ఉండవచ్చని అందుకు తగిన వైద్యం చేయాలని ఆర్మూర్‌లో వైద్యులకు సూచించారు. అక్కడ వైద్యం అందించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అనిరుధ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోక్షిత్ పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. ఇటు పాఠశాలలో ప్రార్థనా సమయంలోనే ఆరో తరగతి చదువుతున్న హేమంత్ అనే మరో విద్యార్థి కూడా కళ్లు తిరుగుతున్నాయని కింద పడిపోయాడు. గమనించిన ఉపాధ్యాయులు మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, 2 వారాల క్రితం ముగ్గురు విద్యార్థులు ఇదే విధంగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో చికిత్స అనంతరం ఇద్దరు కోలుకోగా.. 8వ తరగతి చదివే ఆర్.గణాధిత్య (13) మృతి చెందాడు. అయితే వీరు పాము కాటుకు గురైనట్లు సమాచారం.


అనిరుధ్ (ఫైల్)

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం..

విద్యార్థి అనిరుధ్ మృతి విషయం తెలిసి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గురుకులానికి చేరుకున్నారు. విద్యార్థి మృతికి కారణాలేంటని అక్కడి ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అయితే తమకేం తెలియదని వారు సమాధానం చెప్పడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, విద్యార్థుల వరుస మరణాలకు ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో వసతులు సరిగా లేవని.. తమ పిల్లల భద్రత మాటేంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

ప్రాణం తీసిన ఇన్‌స్టా స్నేహం

- ప్రేమ పేరిట యువకుడి వేధింపులు.. బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య

గుమ్మడిదల, ఆగస్టు 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో చేసిన స్నేహం ఓ యువతి ప్రాణాలు తీసింది. ప్రేమ పేరుతో ఆ యువకుడి వేధింపులు భరించలేక ఓ బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తమ ఇంటి భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు, సోనీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె తేజస్విని(20) ఉన్నారు. బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న తేజస్వినికి అదే గ్రామానికి చెందిన శ్రీహరి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. కొద్ది రోజుల తర్వాత తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని శ్రీహరి వేధించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై తేజస్విని కుటుంబసభ్యులను కూడా బెదిరించాడు. దీంతో తేజస్విని ఇంట్లో నాలుగు రోజుల క్రితం కూడా గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీహరి వేధింపులు తాళలేకపోయిన తేజస్విని గురువారం రాత్రి తమ ఇంటి భవనం మూడో అంతస్తు నుంచి దూకేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న తేజస్వినిని కుటుంబసభ్యులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించింది.


తేజస్విని (ఫైల్)

ఫూడికతీతతో పూర్వస్థితి

ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడిక తీయాలి

- వచ్చే ఇసుకతో ప్రభుత్వానికి ఆదాయం
- మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలి
- 14లోగా ప్రతిపాదనలు అందించాలి
- మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడికతీత పనులు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ప్రాజెక్టుల రక్షణలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ ఉండరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులకు ఏటా వచ్చే భారీ వరదతోపాటు పూడిక కూడా వచ్చి చేరుతోందని తెలిపింది. దీంతో ప్రాజెక్టుల సామర్థ్యం తగ్గుతున్నందున.. పూడికతీతతో పూర్వస్థితిని పునరుద్ధరించాలని సూచించింది. శుక్రవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. పూడికతీతకు ఏయే చర్యలు తీసుకోవచ్చనే దానిపై నీటిపారుదల, మైనింగ్ శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి, 14లోగా అందించాలని మంత్రివర్గం ఆదేశించింది. పూడిక వల్ల డ్యామ్ సేఫ్టీ సమస్యలు తలెత్తడంతో పాటు ఆయకట్టు తగ్గిపోతోందని, తాగునీటి అవసరాలపైనా దీని ప్రభావం పడుతుందని మంత్రులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు పర్యావరణ అనుమతి అవసరంలేదని కేంద్రం చెప్పినందున..దానికనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పూడికలో ఇసుక ఉంటే నిర్మాణ అవసరాలకు వినియోగించుకోవాలని, సారవంతమైన మట్టి ఉంటే రైతాంగానికి ఉచితంగా అందించాలని సూచించారు. పూడికను రైతులే స్వయంగా తీసుకెళ్లేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.


ప్రాజెక్టుల్లో పూడికతీతపై సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం

35 టీఎంసీల నిల్వను కోల్పోయాయి!

మహారాష్ట్ర, రాజస్థాన్‌లో వాణిజ్య అవసరాలకు ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాజెక్టుల్లోని పూడికను వినియోగించుకుంటున్నారని అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. యంత్రాల సహాయంతో డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు 35 టీఎంసీల నిల్వను కోల్పోయినట్లు తేలిందని నివేదించారు. ఏటా పూడిక తీతకు టెండర్లు పిలిచి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తే.. ఇసుక తరలింపుతో ట్యాక్స్, సెస్, జీఎస్టీ, ఇతర రాయల్టీలతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అన్నారు. పూడిక వల్ల జలాశయాలు ఏటా 0-5 శాతం నిల్వలను కోల్పోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 25 ఏళ్లకు పైగా నిండిన జలాశయాలున్నాయని, ప్రయోగాత్మకంగా కొన్నింట్లో పూడికతీత చేపట్టి.. ఆ తరువాత మొత్తం 159 జలాశయాల్లో అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను మింగుతున్న పూడిక

ఏటా వరదల సమయంలో జలాశయాల్లోకి నీటితోపాటు పూడిక వచ్చిచేరుతుండడంతో ప్రాజెక్టుల సామర్థ్యం ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఈ పూడిక.. ప్రాజెక్టుల ఆయుష్షును కూడా తగ్గిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్‌ను 1923లో అప్పటి నిజాం ప్రభుత్వం నిర్మించగా... ఈ ప్రాజెక్టు 1967 నాటికే 52.10 శాతం సామర్థ్యం కోల్పోయింది. అప్పట్లో నిజాంసాగర్‌కు ఎగువన ప్రాజెక్టులే లేకపోవడంతో వచ్చే వరద పూడికతో సహా జలాశయంలో చేరడంతో ప్రాజెక్టు సామర్థ్యం సగానికి పైగా తగ్గింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2016లో నిర్మించిన ర్యాలివాగు సామర్థ్యం 43.30 శాతం మేర తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్టు 1976లో అందుబాటులోకి రాగా... 45 ఏళ్లలో పూడిక కారణంగా 29.96 శాతం మేర నీటినిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఇక నాగార్జునసాగర్ 23.52 శాతం నిల్వ సామర్థ్యం తగ్గింది. మొత్తంగా రాష్ట్రంలో 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ రిజర్వాయర్లు ఉండగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించారు. ఇందులో ఈ ప్రాజెక్టుల సామర్థ్యం 35 టీఎంసీల మేర కోల్పోయిందని గుర్తించారు. ప్రాజెక్టుల్లో పూడిక చేరకుండా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా మొక్కల పెంపకం వంటి చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ నిపుణులు సూచిస్తున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాటిని పూడిక మింగుతోంది. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించాలంటే భూసేకరణ, నిర్మాణ ఖర్చులు కలిపి రూ.162 కోట్లు అవుతాయని లెక్క ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో ఎన్‌హెచ్‌పీ కింద అధ్యయనం చేసిన జలాశయాలు రూ.5670 కోట్ల మేర నష్టపోయాయి.

పీర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం

పీర్జాదిగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఖాతాలోకి మరో మునిసిపల్ కార్పొరేషన్ చేరింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం నగర పాలక మండలి సమావేశం జరిగింది. మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా.. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది ఓటు వేశారు. దీంతో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లుగా ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే మేయర్ ఎన్నికకు తేదీ ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అరాచక పాలనకు తెరపడిందని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 12వ డివిజన్ కార్పొరేటర్ అమర్‌సింగ్‌ను తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

నిర్మల్ వాసి ఆడు జీవితం

- సౌదీలో ఒంటెల కాపరిగా నామ్‌దేవ్
- రక్షించాలంటూ సెల్ఫీ వీడియో
- టీజీఎండీసీ చైర్మన్ అనిల్ ట్వీట్‌తో భారత ఎంబసీ స్పందన
- నామ్‌దేవ్ ఆచూకీ గుర్తించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)


దళారుల మాటలు నమ్మి భారత్ నుంచి సౌదీ అరేబియా వెళ్లి ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేసే ఓ వ్యక్తి దుర్భర జీవితం ఇతివృత్తంగా ఇటీవల ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన రాథోడ్ నామ్‌దేవ్(51) అనే వ్యక్తి ఆ సినిమాలో మాదిరిగా సౌదీ ఎడారిలో దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఈ కష్టాల నుంచి రక్షించండి అని వేడుకుంటూ నామ్‌దేవ్ ఇటీవల సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పెట్టడంతో ఈ విషయం బయటికొచ్చింది. నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు స్పందన రావడంతో అతను స్వదేశానికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) చైర్మన్ ఈరవత్రి అనిల్ స్పందించారు. నామ్‌దేవ్‌ను సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి, కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులను ఎక్స్(ట్విటర్) ద్వారా కోరారు. దీంతో కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులు నామ్‌దేవ్‌ను సంప్రదించారు. కువైత్ సరిహద్దులోని సౌదీ అరేబియా ఎడారిలో నామ్‌దేవ్ ఉన్నట్టు గుర్తించారు. చాలా కాలంగా గల్ఫ్‌లో ఉంటున్న నామ్‌దేవ్‌ను అతని యజమాని పది నెలల క్రితం సౌదీలోని ఒంటెల క్షేత్రానికి తరలించినట్టు తెలిసింది. కాగా, సౌదీ, కువైత్‌లోని ప్రవాసీయులు నామ్‌దేవ్‌ను సంప్రదించేందుకు యత్నించగా అతని ఫోన్ స్విచ్చాఫ్‌లో ఉంది. నామ్ దేవ్‌ను ఏ విధంగా స్వదేశానికి పంపిస్తారో తెలియాల్సి ఉంది.

కేంద్రానివి ప్రజా వ్యతిరేక విధానాలు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రైతు సంఘం కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 9: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని జిల్లా రైతు సంఘం కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. క్విట్‌ఇండియా ఉద్యమ స్ఫూర్తితో బీజేపీ వ్యతిరేక విధానాల నుంచి దేశాన్ని కాపాడుకునేందుకు ఐక్యంగా ప్రతిఘటించాల్సిన అవసరముందన్నారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. రాజీవ్‌చౌక్ వద్ద కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మోదీ సర్కార్ కార్పొరేట్లకు కోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతుందని మండిపడ్డారు. కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కానుగుల వెంకటయ్య, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, పెంటయ్య, సీఐటీయు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రంగనాయకస్వామి రథోత్సవం


రథోత్సవంలో కేరళావాయిద్యాల నడుమ భక్తుల నృత్యాలు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 9: మండల పరిధి ఎదులాబాద్‌లోని శ్రీగోదా సమేత శ్రీమన్నార్ రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం దివ్య విమాన ర థోత్సవ ఊరేగింపు అంగరం గ వైభవంగా జరిగింది. స్వామివారి రథాన్ని రంగురంగుల విద్యుద్దీపాలు, అరటికొమ్మలతో సుందరంగా ముస్తాబుచేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, హరివర్ధన్‌రెడ్డిలు దివ్యవిమాన రథానికి ప్రత్యేక పూజలు చేశారు. రథాన్ని ముందుకు లాగి ప్రారంభించారు. అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రత్యేకపూజలు చేశారు. భక్తుల కోలాహలంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీ య ఘటనలు తలెత్తకుండా సీఐ సైదులు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బట్టె శంకర్, నాయకులు వేముల మహేష్‌గౌడ్, కందులకుమార్, విశ్వనాథం, రామోజీ, సుధాకర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, సావల్ సురేష్, కర్రె రాజేష్, సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఓం ప్రకాష్, రాజేందర్‌గౌడ్, జనార్దన్ పాల్గొన్నారు.


రథోత్సవంలో పాల్గొన్న అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, తోటకూర వజ్రేష్‌యాదవ్

ఆదివాసుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఆమనగల్లు/కడ్తాల్, ఆగస్టు 9: ఆదివాసుల హక్కుల పరిరక్షణ, ఆర్థికాభివృద్ధి, ఆత్మగౌరవం పెంపునకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్‌కార్యాలయం ఆవరణలో శుక్రవారం చెంచు సేవా సంఘం రాష్ట్ర నాయకుడు మండ్లీ రాములు ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసం దినోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, రాష్ట్ర కాలుష్య నియంత్రణమండలి సభ్యుడు బాలాజీ సింగ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చెంచు సేవా సంఘం నాయకులు, చెంచులు, వివిధ పార్టీల నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కసిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చెంచుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తుందని చెప్పారు. వైస్ చైర్మన్ దుర్గయ్య, మార్కెట్ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, చేనేత సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, నాయకులు అప్పం శ్రీను, నిట్ట నారాయణ, కాలె మల్లయ్య, వస్పుల మానయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని కడ్తాల్ గిరిజన బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి రాములు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి, డీటీడీవో రామేశ్వరి దేవిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కొమురంభీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో సుజాత, మాజీ ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, శంకర్, శేఖర్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లులో కొమురంభీం విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డులు పంపుతున్న సింగరేణిరిటైర్డ్ ఉద్యోగులు

ఘట్‌కేసర్, ఆగస్టు 9: అనేక సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు పంపించారు. ఈసందర్భంగా ఘట్‌కేసర్ పోస్టాఫీసు వద్ద జరగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. అనేక సంవత్సరాల గాలి, వెలుతురులేని బొగ్గుబావుల్లో పనిచేసి రిటైర్డ్ అయిన తమకు అతితక్కువ పించన్ అందిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇచ్చే అరకొర పించన్ వైద్య ఖర్చులకైనా సరిపోవడం లేదన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు తెల్లరేషన్ కార్డులతోపాటు ఆసరా పించన్లు, అన్ని రకాల ఉచిత వైద్యం, 200వందల చదరపు గజాల ఇంటి స్థలం లేదా ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ నిర్వాహకులు అళవందార్ వేణుమాధవ్, కనకయ్య, రాజయ్య, వెంకటస్వామి, రాజిరెడ్డి, మురళీకృష్ణ, మదనయ్య, సమంమయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల అవకతవకలపై విచారణ

ప్రజావాణిలో ఫిర్యాదుతో స్పందించిన అధికారులు

తాండూరు రూరల్, ఆగస్టు 9: బిజ్వార్ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ స్వరూప ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడ్డారని గ్రామానికి చెందిన కొంతమంది ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్‌తో కలిసి ఏపీవో నరోత్తంరెడ్డి సమక్షంలో విచారణ జరిపారు. తాండూరు మండ లం బిజ్వార్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేసిన వారిని పంచాయతీ కార్యాలయానికి పిలిచి ఫీల్డ్‌అసిస్టెంట్ స్వరూపాను విచారించారు. అయితే కొంతమంది ఉపాధి హామీ పథకం పనులు చేపట్టేందుకు 187మందికి జాబ్‌కార్డులు ఇచ్చామని, అందులో 150 మంది వరకు పనుల్లోకి వస్తారని ఆమె పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ స్వరూపా భర్త పనుల్లో జోక్యం చేసుకుని కూలి తక్కువ రాసే ప్రయత్నం చేస్తున్నారని కొంతమందికి కూలీలు పేర్కొన్నారు. ఎంపీడీవో స్పందిస్తూ ఇప్పటి నుంచి ఉపాధి హామీ పనుల వద్దకు ఫీల్డ్ అసిస్టెంట్ స్వరూప వెళ్లాలని ఆదేశించారు. నిధులు లేక కూలి మే 19వ తేదీ వరకే వారి ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఎల్కన్నె సహకార బ్యాంకు డైరెక్టర్ అనంతమ్మ, చంద్రప్పలు మాట్లాడుతూ.. కోమటికుంట, కానుగకుంట, సీతకుంటలో ఉపాధి హామీ పనులు చేపట్టామని, అట్టి పనులకు సంబంధించి 74మంది కూలీలకు డబ్బులు రావాల్సి ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఉపాధి హామీ పనుల పర్యవేక్షణలో టెక్నికల్ అసిస్టెంట్ భూపతి, బిజ్వార్ గ్రామంలో పనులు కొనసాగేటప్పుడు పర్యవేక్షించకపోవడం వల్లే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కొందరు కూలీలు వాపోయారు. ఈ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని అధికారులు వెల్లడించారు.


విచారణ జరుపుతున్న ఎంపీడీవో విశ్వప్రసాద్

హెచ్ఎండీఏలో మేడ్చల్ జోన్ విభజన

మేడ్చల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నగరశివారు చుట్టూ విస్తరించి ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మేడ్చల్ జోన్ రెండుగా విభజిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటి వరకు ఘట్‌కేసర్, మేడ్చల్ జోన్లు ఉండగా ఘట్‌కేసర్ జోన్‌ను యథావిధిగా ఉంచి, మేడ్చల్‌ను రెండు జోన్‌లుగా విభజించారు. త్వరలో ఆర్ఆర్ఆర్ మొత్తం హెచ్ఎండీఏ పరిధిలోకి తెచ్చేందుకు ప్రణాళికలో భాగంగా మేడ్చల్‌ను రెండుగా విభజించినట్లు తెలిసింది. మేడ్చల్‌జోన్ పరిధి ఎక్కువగా ఉండటంతో సేవల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. జోన్‌ను విభజించి అదనపు సిబ్బంది నియామకానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. మేడ్చల్ జోన్-1లో బాచుపల్లి, గుండ్లపోచంపల్లి, నర్సాపూర్, శామీర్‌పేట, శివంపేట్, తూప్రాన్, మనోహరాబాద్ ప్రాంతాలు ఉండగా, మేడ్చల్‌జోన్-2లో కొంపల్లి, మేడ్చల్, పీఎస్‌యూ, గ్రిడ్‌రోడ్, ఉప్పల్ భగాయత్, దుండిగల్, గండిమైసమ్మ, ములుగు, వర్గల్, కాప్రా ప్రాంతాలున్నాయి. మేడ్చల్‌జోన్-1 ప్లానింగ్ అధికారికగా గోపిక రమ్య, మేడ్చల్ జోన్-2 ప్లానింగ్ అధికారిగా కె.శాలినిలకు బాధ్యతలు అప్పగించారు.

విధులు బాధ్యతగా నిర్వర్తించాలి


చేవెళ్లలో మాట్లాడుతున్న డీడీఎంహెచ్‌వో దామోదర్

చేవెళ్ల, ఆగస్టు9: విధులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని చేవెళ డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్ తెలిపారు. శుక్రవారం చేవెళ్ల డివిజన్ కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య వైద్యులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. చేవెళ్ల డివిజన్‌లో పూర్తిస్థాయిలో వైద్యసిబ్బంది బదిలీలు జరిగాయన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు సైతం వైద్యులు అందుబాటులో ఉండి వైద్యం అందించాలన్నారు. శుక్ర, సోమవారాల్లో గర్భిణీలకు వైద్య పరీక్షలు చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపీల సంఖ్య పెంచాలన్నారు. సీహెచ్‌వో సంతోష, అధికారి బలరాం, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు, ఆగస్టు 9: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 33 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఎంపీడీవో అనురాధ, తహశీల్దార్ రమేష్ కుమార్, నాయకులు కృష్ణారెడ్డి, కె.రామయ్య గౌడ్, కావలి యాదయ్య, సయ్యద్ సాధిక్, సి.కృష్ణయ్య, బి.నరేందర్, ఆర్.రామస్వామి, గోవర్థన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసులకు అండగా ఉండండి

కేశంపేట, ఆగస్టు 9: ఆదివాసులకు అండగా ఉండాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు మూడావత్ రాంబల్ నాయక్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కోరారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీ హక్కుల పోరాటంలో కలిసి రావాలని కోరగా.. కేటీఆర్ సానుకూలంగా స్పందించారని రాంబల్ నాయక్ తెలిపారు.


కేటీఆర్ పుష్పగుచ్ఛం ఇస్తున్న రాంబల్‌నాయక్

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



కీసర: కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలోని పుట్టలో పాలుపోస్తున్న మహిళ, పాల్గొన్న భక్తులు



మూడుచింతలపల్లి: పుట్టలో పాలు పోస్తున్న మహిళలు



వికారాబాద్: నాగుల పుట్ట వద్ద భక్తుల పూజలు



తాండూరు: సాయిపూర్‌లో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

వికారాబాద్, ఆగస్టు 9: వికారాబాద్ జిల్లా కేంద్రంలో నాగుల పంచమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నాగ దేవత ఆలయంతో పాటు ఆయా వార్డుల్లో ఉన్న నాగుల పుట్టల వద్ద భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. నాగుల పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఆయా కాలనీలో వార్డు కౌన్సిలర్లు పుట్టల వద్ద ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.

తాండూరు: నాగుల పంచమిని పురస్కరించుకుని తాండూరు పట్టణంలో మహిళలు శాంత్ మహల్ థియేటర్ వెనుక భాగంలో, కట్టమైసమ్మ దేవాలయంలో నాగ దేవత, సాయిపూర్‌లోని నాగ దేవతలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పట్లోళ్ల దీపాన ర్సింహులు, కౌన్సిలర్ సంగీత ఠాకూర్, పట్లోళ్ల నీరజా బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తాండూరు రూరల్: నాగుల పంచమిని పురస్కరించుకుని తాండూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని పుట్టతోపాటు ఆయా గ్రామాల్లోని పుట్టల వద్ద మహిళలు పూజలు నిర్వహించి పాలు పోశారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న పుట్ట వద్ద మాజీ ఎంపీపీ అనితాగౌడ్, మాజీ జడ్పీటీసీ గౌడి మంజుల, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు శకుంతల దేశ్‌పాండే, ఎంపీడీవో విశ్వప్రసాద్, తహసీల్దార్ తారాసింగ్, ఏంపీవో శ్రీనివాస్, ఏపీవో నరోత్తంరెడ్డితోపాటు చుట్టుపక్కల ప్రాంతాల కాలనీవాసులు పూజలు నిర్వహించి పాలు పోశారు.

కులకచర్ల: కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో శుక్రవారం నాగుల పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాంబండ ఆలయం ఆవరణలో మాజీ జడ్పీటీసీ రాందాస్‌నాయక్ సతీమణి మాజీ ఎంపీటీసీ బుడ్డమ్మ నాగులకు పాలుపోసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ విఠల్‌నాయక్ దంపతులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: నాగుల పంచమి వేడుకలను మోమిన్‌పేట్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పుట్టల్లో పాలుపోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగులపంచమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఘట్‌కేసర్: నాగుల పంచమి సందర్భంగా పోచారం మున్సిపాలిటీ పోచారంలో గల సర్వ మంగళాసమేత స్పటిక లింగేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన నాగదేవత అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. ఈసందర్భంగా నాగదేవతను దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. పలుచోట్ల మహిళలు పుట్టల్లో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

మూడుచింతలపల్లి: నాగుల పంచమి వేడుకలను మండలంలలో భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. నాగేంద్రుడి పుట్టలో పాలు పోసి వారి మొక్కులను చెల్లించుకున్నారు.

శామీర్‌పేట: శామీర్‌పేట తూంకుంట మున్సిపల్‌లో శుక్రవారం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంతో పాటు మున్సిపల్‌లో మహిళలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తూంకుంటలో మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్ దంపతులు పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య



గ్రీష్మారెడ్డి(ఫైల్)

కీసర రూరల్, ఆగస్టు 9: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శుక్రవారం కీసర పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటుచేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన భాస్కర్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి నాగారం మున్సిపాలిటీ కేకేనగర్ కాలనీలో నివాసముంటున్నాడు. తన భార్య గ్రీష్మారెడ్డి(25) కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఇంటి నుంచే ఆమె విధులు నిర్వహిస్తోంది. కాగా ఆమె ఉన్నట్టుండి సాయంత్రం తన బెడ్ రూంలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యుల వేధింపుల వల్లే ఆత్మహత్యకు పాల్పడిందని గ్రీష్మారెడ్డి తాలూకు బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కుషాయిగూడ ఏసీపీ మహేష్ విచ్చేసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

లారీ ఢీకొని మహిళ మృతి

కీసర రూరల్, ఆగస్టు 9: లారీ ఢీకొని మహిళ దుర్మరణం చెందింది. ఈ ఘటన శుక్రవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామానికి చెందిన ఆనంద్‌కుమార్ తన భార్య కవిత(28), కూతురు, కొడుకుతో కలిసి సరుకులు కొనుగోలు చేసేందుకు తన బైక్‌పై కుషాయిగూడకు వెళ్లారు. షాపింగ్ ముగించుకుని తిరిగి ఇంటికి బయల్దేరారు. ఈ క్రమంలో వారు కీసర పోలీస్‌స్టేషన్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ ఉన్న కవిత రోడ్డుపై పడి తీవ్రగాయాలపాలైంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన 'స్వచ్ఛదనం - పచ్చదనం'



తాండూరు: కార్మికులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, కౌన్సిలర్ విజయదేవి



పరిగి: మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్



మేడ్చల్ టౌన్: మొక్కలు నాటుతున్న చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి

తాండూరు, ఆగస్టు 9: ఐదు రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మతకంగా చేపట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ నెల 5న ప్రారంభమైన ఈ కార్యక్రమం రోజు కో కార్యక్రమంతో గ్రామాలు, పట్టణాలలో పరిధిలో వార్డుల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేకనిధులు కేటాయించక పోవడంతో ప్రభుత్వం ఆశించినస్థాయిలో ఫలితాలు రానట్లు తెలుస్తోంది. చివరిరోజు శుక్ర వారం వార్డు ఆఫీసర్లు, జవాన్లు, సూపర్ వైజర్లు కలిసి వార్డుల్లోని కుటుంబాలకు ప్రతీ శుక్రవారం మీ ఇంట్లో మీరే డ్రై డేగా పాటించాలని సూచించారు. పలు వార్డుల్లో మొక్కలు నాటారు. కౌన్సిలర్ విజయదేవి సొంత ఖర్చులతో పారిశుధ్య కార్మికులను శాలువాలతో సత్కరించి, టవళ్లు, చీరలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, కౌన్సిలర్లు విజయదేవి, సంగీతాఠాకూర్, శోభరాణి, మధుబాల, సాహ్రా శ్రీలత, మేనేజర్ నరేందర్, వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: బిజ్వార్ గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా ఎంపీడీవో విశ్వప్రసాద్, అధికారుల బృందం మొక్కలు నాటారు. ఇందులో భాగంగా బిజ్వార్‌లోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఎంపీడీవో విశ్వప్రసాద్ అధికారులు, గ్రామస్తులతో కలిసి పిచ్చి మొక్కలు తొలగించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఏపీవో నరోత్తంరెడ్డి, టీఏ భూపతి, ఫీల్డ్ అసిస్టెంట్ స్వరూపా గ్రామస్తులు ఉన్నారు.

పరిగి: స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చివరి రోజు పట్టణంలోని 7వ వార్డులో మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్, కమిషనర్ వెంకటయ్య మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎదిరె కృష్ణ, రవీంద్ర, ఎర్రగడ్డపల్లి కృష్ణ, శ్రీనివాస్, మునీర్, కిరణ్‌కుమార్, మీర్ తాహెర్ అలీ, మౌలానా, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మొరంగపల్లి గ్రామంలో మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య శుక్రవారం రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మానెయ్య, బుచ్చయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

బషీరాబాద్: కాశీంపూర్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో గాలి యాదయ్య గ్రామంలోని పలు వార్డుల్లో కలియతిరిగి మహిళలకు అవగాహన కల్పించారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్ టౌన్: మున్సిపల్ పరిధిలోని 14వ, వార్డులో మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రిదీపిక నర్సింహారెడ్డి శుక్రవారం చివరి రోజు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో మొక్కలు నాటారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమేష్, కమిషనర్ నాగిరెడ్డి, టీపీవో, స్థానిక కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, ఉమానాగరాజు, కౌడె మహేష్, నాయకులు మర్రి నర్సింహారెడ్డి, నడికొప్పు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఇంటిగ్రేటెడ్ వేజ్, నాన్ వేజ్ మార్కెట్ యార్డులో శుక్రవారం స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ప్రభాకర్, ప్రత్యేక అధికారి వినోద్, కమిషనర్ స్వామి, కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, హంస రాణి కృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలోని వేమన నగర్‌లో విజ్ఞాన్ ఇంజనీరింగ్, సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో కలిసి మేడ్చల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మొక్కలు మొక్కలు నాటారు. అదేవిధంగా పోచారం మున్సిపాలిటీ నారపల్లిలోని భాగ్యనగర్ నందనవనంలో స్థానిక నారపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులతోపాటు అటవీ శాఖ అధికారులతో కలిసి మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, కమిషనర్లు సాబేర్ అలీ, వేమనరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు కృషి చేయాలని డిప్యూటీ సీఈవో నీరజ, ఎంపీడీవో వత్సలాదేవిలు అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో మండలంలోని కేశవరం గ్రామంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మంగతాయారు, పంచాయితీ కార్యదర్శి గౌతమి, అటవీశాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కీసర రూరల్: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో చివరి రోజు ప్రభుత్వ పాఠశాలలను శుభ్రం చేయటం, పంచర్ దుకాణాల వద్ద టైర్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించటం, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి విచ్చేసారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత, కమిషనర్ నాగమణి, కౌన్సిలర్లతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, ప్రత్యేకాధికారి జిల్లా భూగర్భ జల వనరుల శాఖ అధికారి రేవతి, కమిషనర్ రాజేందర్‌కుమార్, వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్, డీఈఈ సుదర్శనం రఘు, మేనేజర్ చంద్రశేఖర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శామీర్‌పేట: స్వచ్ఛదనం -పచ్చదనంలో భాగంగా తూంకుంట మున్సిపల్ పరిధిలోని పల్లవి ప్రోగెసీవ్ ఉన్నత పాఠశాలలో, పబ్లిక్ పార్క్‌లో మున్సిపల్ కమిషనర్ కమిషనర్ వెంకటగోపాల్ ఆధ్వర్యంలో చివరిరోజు శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. అలాగే తూంకుంటలోని పబ్లిక్ పార్క్‌లో మున్సిపల్ కమీషనర్ వెంకటోపాల్, విద్యార్థులు ఎంతో ఉత్సహంగా మొక్కలను నాటారు. అనంతరం తూంకుంటలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ కౌన్సిలర్లు సింగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, రాజుకుమార్‌యాదవ్ పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి



తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

మూడుచింతలపల్లి, ఆగస్టు 9: రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడిన ముదిరాజ్ కులస్తులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలో చేర్చాలని ముదిరాజ్ సంఘం నాయకులు కోరారు. మూడుచింతలపల్లిలోని తహసీల్దార్ కార్యలయంలో శుక్రవారం తహసీల్దార్ వెంకట నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజర్వేషన్ విషయంలో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వమే తేల్చుకోవాలన్న విషయాన్ని గుర్తుచేశారు. ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు సీఎం నిధులు మంజూరు చేయాలన్నారు. చెరువులు, కుంటలపై సంపూర్ణ హక్కులను కల్పించాలని, మత్స్యకారులకు సబ్సిడీపై రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు వెంకటేష్, మంద స్వామి, సత్యానారాయణ, వెంకటస్వామి, రాజు, దశరథ్, ప్రభాకర్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట: సమాజంలో ఎన్నో ఏళ్ళుగా అన్ని రంగాల్లో వెనకబడి ఉన్న ముదిరాజులను ప్రభుత్వం వెంటనే గుర్తించి బీసీ-డి నుంచి బీసీ- ఏ గ్రూప్‌లో చేర్చి పునరుద్ధరణ తక్షణమే అమలు చేయాలని శామీర్‌పేట మండల ముదిరాజుల సంఘం అధ్యక్షుడు కావాలి శంకర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. శామీర్‌పేట మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట శుక్రవారం మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కావాలి శంకర్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఘనంగా తిరుపతిరెడ్డి జన్మదిన వేడుకలు



బొంరాస్‌పేట్‌లో కేక్ కట్ చేస్తున్న తిరుపతిరెడ్డి

బొంరాస్‌పేట్, ఆగస్టు 9: కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన బొంరాస్‌పేట్ పర్యటనలో భాగంగా శుక్రవారం మండల నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకుంటూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ హన్మంత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించడంతో పాటు శశాంక్ రెడ్డి తల్లి మృతిచెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పరిగి, ఆగస్టు 9: పరిగి పట్టణ శివారులోని తుంకుల్‌గడ్డ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ థామస్‌రెడ్డిని ఉపాధ్యాయులు శుక్రవారం సన్మానించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

నవాబుపేట, ఆగస్టు 9: అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేదలకు సీఎం సహాయనిధి అండగదా నిలుస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మండలంలోని అక్నాపూర్ గ్రామానికి చెందిన పెద్దోళ్ల రాములుకు మంజూరైన రూ.2లక్షల 50వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బషీరాబాద్: తాండురు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆదేశానుసారం నవాంద్గీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ శుక్రవారం బషీరాబాద్‌లోని తన నివాసంలో బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎఎంసీ డైరెక్టర్లు వడ్డే హన్మంతు, రథోడ్ నరేష్, యూత్ లీడర్ శ్రీకాంత్, సుభాష్, అంబాదాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

యాలాల, ఆగస్టు 9: ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా నాయకులు ఉప్పలి మల్కయ్య అన్నారు. యాలాల మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తంచేసి తహసీల్దార్ అంజయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సిములు, కృష్ణ, డి.నర్సింహులు, కమలాపురం నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ పాలిటెక్నిక్‌లో ఆగస్టు 12న స్పాట్ అడ్మిషన్లు

వికారాబాద్, ఆగస్టు 9: వికారాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మిగిలిన డిప్లమా ప్రథమ సంవత్సరం సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఖాళీ సీట్ల ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్ ఈ నెల 12న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 9నుంచి 11వరకు కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవచ్చని పాలిసెట్ ఎంట్రెన్స్‌లో అర్హత సాధించిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆగస్టు 12వ తేదీ ఉదయం 10 గంటలలోపు వికారాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు చేరాలన్నారు. సీటు లభించిన విద్యార్థులు ఫీజు రూ.5080 కౌన్సిలింగ్ ఫీజు వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు. లేదంటే సీటు మరొక అర్హుడైన విద్యార్థికి కేటాయిస్తామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కులకచర్ల, ఆగస్టు 9: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని స్థానిక గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉత్సవాలు నిర్వహించారు. ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలను హెచ్‌ఎం సుందర్‌రాజ్ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్, గోపాల్, రాములు, రమేశ్, సతీశ్, రాజు, వంశీకృష్ణ, కృష్ణయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు 50శాతం పీఆర్‌సీ మంజూరు చేయాలి

ధారూరు, ఆగస్టు 9: ఉపాధ్యాయులకు 50శాతం పీఆర్‌సీ మంజూరు చేయాలని పీఆర్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కేరెల్లి, బాచారం, ఎబ్బనూర్, చింతకుంట, హరిదాసుపల్లి రాంపూర్ తండా, గట్టేపల్లిలోని పాఠశాలల్లో శుక్రవారం పీఆర్‌టీయూ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఉపాధ్యాయులకు సంఘం సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పెండింగ్ డీఏ, పెండింగ్ బిల్స్ 317జీవో సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు శ్రీనివాస్, మాణిక్యం, మల్లికార్జున్, శ్రీనివాస్, బుచ్చయ్య పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: పీఆర్‌టీయూ బలోపేతానికి సభ్యత్వ నమోదులు చేస్తున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు మల్లేశం తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో శుక్రవారం ఉపాధ్యాయులతో పీఆర్‌టీయూలో సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి నాగేశ్వర్, గౌరవ అధ్యక్షుడు అనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శి రమేశ్, మండల కార్యదర్శి రాఘవేందర్, రాందాస్, ఉపాధ్యాయులు సుధాకర్ పాల్గొన్నారు.

కులకచర్ల: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులు, డీఏలు, పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని ముజాహిద్‌పూర్, పుట్టపహడ్, సాల్వీడ్, కులకచర్ల బాలుర ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హబీబ్ అహ్మద్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బస్వరాజ్, పరిగి మండల అధ్యక్షుడు శ్రీశైలం, రాష్ట్ర బాధ్యుడు పెంటయ్య, నర్సింహులు, కిష్టయ్య, సతీశ్ పాల్గొన్నారు.

భూ సంస్కరణల అమలుకు పోరాటం

తాండూరు, ఆగస్టు 9: పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్య స్ఫూర్తితో భూ సంస్కరణలు చేపట్టి భూమి లేనిపేదలకు భూములు పంచే వరకూ పోరాటం చేద్దామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ అన్నారు. తాండూరు పట్టణం అంబేద్కర్ విగ్రహం ముందు శుక్రవారం పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్యకు సీపీఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యు.బుగ్గప్ప, సీపీఎం నాయకులు సిరియాల, నవీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రధాన్యం

ఘట్‌కేసర్, ఆగస్టు 9: మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులోని పోచారం-సంస్కృతీ టౌన్‌షిప్‌ఎకు రూ.10లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వేమనరెడ్డి, నాయకులు బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, అకిటి బాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, మహేష్‌గౌడ్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాది కుటుంబంపై పోలీసుల దాడి హేయం



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్

వికారాబాద్, ఆగస్టు 9: జనగామ జిల్లాలో న్యాయవాద దంపతులు అమృత్‌రావు, కవిత దంపతులపై పోలీసులు దాడి హేయమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం న్యాయవాదులు కోర్టు నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయం ఎదుట మూడోరోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన పోలీసులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవా దులు గోవర్ధన్‌రెడ్డి, మాదవరెడ్డి, సంపూర్ణ ఆనంద్, బస్వలింగం పటేల్, చౌదరి యాదవరెడ్డి పాల్గొన్నారు.

'న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలి'

న్యాయవాదులపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు ఎన్.శుభప్రద్ పటేల్ అన్నారు. జనగామలో న్యాయవాదులపై దాడికి నిరసనగా వికారాబాద్ బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేస్తున్న నిరసన దీక్షకు శుభప్రద్‌పటేల్ సంఘీభావం తెలిపారు. అనంతరం దీక్ష చేస్తున్న న్యాయవాదులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ కయూమ్, జనరల్ సెక్రటరీ వెంకటేశ్, న్యాయవాదులు కమాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బస్వరాజ్, సంపూర్ణ ఆనంద్, యాదవరెడ్డి, మాదవ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు భూలక్ష్మమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

మోమిన్‌పేట్, ఆగస్టు 9: మండలంలోని కోల్కుందలో శనివారం(నేడు) శ్రీ భూలక్ష్మమ్మ విగ్రహ ప్రతిష్టాపనతో ఆలయ ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యావాహచనం, జలఅభిషేకం, దేవతల ఆహ్వానంతో పాటు మడుగుల సర్వోత్తమ శర్మ బృందం ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సంక్షిప్తంగా..

● **బొంరాస్‌పేట్:** ఈ నెల 27న వికారాబాద్ జిల్లా కేంద్రంలో సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో సదరం క్యాంప్ నిర్వహించనున్నట్లు ఐఈఆర్‌పీ ఉపాధ్యాయుడు వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని టేకులగడ్డతండా పాఠశాలను శుక్రవారం సందర్శించి విద్యార్థులు ఇషాని, శ్వేతను శిబిరానికి తీసుకురావాలన్నారు.

● **వికారాబాద్:** ఆర్టీసీ అందించే సేవలను ప్రజలు వినియోగించుకోవాలని రంగారెడ్డి, నల్లగొండ లాజిస్టిక్ అధికారి రవీందర్ అన్నారు. వికారాబాద్ పట్టణ, సమీపంలోని గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో టీజీఎస్‌ఆర్టీసీ మొబైల్ లాజిస్టిక్ కౌంటర్‌ని ఆర్టీసీ అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు భాను ప్రసాద్, చంద్రయ్య, విశ్వనాథ్‌గౌడ్, వసంత్, గోపాల్, సులోచన పాల్గొన్నారు.

● **తాండూరు రూరల్:** తాండూరు పట్టణానికి చెందిన శ్రీసాయిపుత్ర హోం నీడ్స్ అండ్ డెవలపర్స్ అధినేత భావనోళ్ల శంకర్ యాదవ్ కుమారుడు అభినవ్ తన పాకెట్ మనీతో కొత్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు.

● **పూడూరు:** మన్నెగూడ బస్టాండ్ ఎదుట టీజీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్ నూతన కౌంటర్‌ను ఆర్టీసీ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. కౌంటర్ ఏజెంట్‌గా మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు అనంత్‌రెడ్డిని నియమించినట్లు రంగారెడ్డి, నల్గొండ లాజిస్టిక్ అధికారి రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ అధికారులు భాను ప్రసాద్, తాండూరు డిపో చంద్రయ్య, పరిగి డిపో విశ్వనాథ్‌గౌడ్, వికారాబాద్ డిపో వసంత్ పాల్గొన్నారు.

● **కొడంగల్:** యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జాతీయ కోఆర్డినేటర్ కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొడంగల్‌లోని గాంధీనగర్‌లో శుక్రవారం జెండా ఎగరవేశారు. అనంతరం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటేశ్, సభ్యులు పాల్గొన్నారు.

● **తాండూరు:** శ్రావణ మాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని నెహ్రూ గంజ్‌లో కొలువైన రేణుక ఎల్లమ్మను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అమ్మవారు భక్తులు సమర్పించిన పంచవర్ణ చీరల్లో దర్శనమించ్చారు.

పాఠశాల రేకులు, టేకు కట్టెల వేలం

దోమ, ఆగస్టు 9: దోమ బాలుర ఉన్నత పాఠశాల రేకులు, టేకు కట్టెలను శుక్రవారం వేలం నిర్వహించారు. వేలంలో పాల్గొనేందుకు ఆరుగురు డిపాజిట్ చేయగా పరిగికి చెందిన ఎండీ.ఆసిఫ్ రేకులను రూ. 43500కు అత్యధిక పాట పాడి దక్కించుకున్నాడు. టేకు కట్టెలకు సరైన ధర రాకపోవడంతో వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో మహేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ

కులకచర్ల, ఆగస్టు 9: గ్రామాల్లో 14వ విడత సామాజిక తనిఖీ శనివారం నుంచి నిర్వహించనున్నట్లు ఉపాధిహామీ సిబ్బంది సహకరించాలని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పనులకు గాను సామాజిక తనిఖీ నిర్వహించడానికి సామాజిక తనిఖీ బృందం గ్రామాల వారీగా వెళ్లి తనిఖీ బృందం గ్రామాల వారీగా వెళ్లి తనిఖీ చేసినట్లు తెలిపారు. ఉపాధిహామీ పథకంలో జరిగిన దాదాపు రూ.9కోట్ల పనులను పరిశీలించి మండల కేంద్రంలో జరిగే సమావేశంలో వివరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కరీం, ఏపీవో వెంకటేశ్‌గౌడ్, ఈసీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.